కర్ణాటక టెట్రాకు తగ్గని క్రేజ్!

మేము అధికారంలోకి వస్తే తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీని తీసుకువచ్చి ప్రైవేట్ వారికి మద్యం షాపులు కేటాయించారు. నాణ్యమైన మద్యం తీసుకురాలేదు. దీనికితో కూటమి నేతలు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టానుసారంగా అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లోని మందుబాబులు కర్ణాటక టెట్రా ప్యాకెట్లపై ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ మంది అక్కడికే వెళ్లి మద్యం కొనుగోలు చేస్తున్నారు.



కర్ణాటక టెట్రా ప్యాకెట్లు



పోలీసులు సీజ్ చేసిన కర్ణాటక టెట్రా ప్యాకెట్లు (ఫైల్)

- ఏపీలో అందుబాటులో లేని రూ.99 క్వార్టర్
- నాణ్యత లేని మద్యం అమ్మకాలు
- కర్ణాటకలో తక్కువ ధరకే నాణ్యమైన మద్యం
- సరిహద్దులోని దుకాణాల బాట పడుతున్న మందుబాబులు

పలమనేరు: నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ.99లకే ఇస్తామన్న సీఎం చంద్రబాబు మాటలు నీటి మూటలయ్యాయి. విస్కీ, ఒరిజినల్ చాయిస్, డీలక్స్ విస్కీ, త్రిబుల్ ఎక్స్ రమ్, ఓల్డ్ అడ్మిరల్, బ్రాందీ తదితర బ్రాండ్లు 90 ఎంఎల్ ఇక్కడ రూ.140 నుంచి రూ.220 వరకు ఎమ్మార్పీ వుంది. షాపుల వారు సిండికేట్‌గా మారి ధర పెంచి అమ్ముతున్నారు. మరోవైపు మద్యం కల్తీ కూడా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవే బ్రాండ్లు కర్ణాటకలో 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ రూ.40లకు విక్రయిస్తున్నారు. అదే క్వార్టర్ టెట్రా ప్యాకెట్ రూ.80లు వుంది. మద్యం కూడా నాణ్యంగా వుండడంతో మందుబాబులు కర్ణాటక సరిహద్దుల్లోని షాపులకు వెళ్లి టెట్రా ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్నారు. పలమనేరు సమీపంలో నంగళి, తిమ్మరాయనిగ్లి, వి.కోటకు అతి సమీపంలోను, కుప్పం నియోజకవర్గంలో ఐదు నుంచి పది కిలోమీటర్లలోనే కర్ణాటక సరిహద్దు వుంది. అక్కడ పదుల సంఖ్యలో మద్యం షాపులున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో రాజుపల్లి వద్ద కర్ణాటక మద్యం షాపులున్నాయి. ఈ క్రమంలో మందుబాబులు నిత్యం బోర్డర్లబాట పడుతున్నారు. కొంతమంది కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లను తీసుకువచ్చి స్థానికంగా విక్రయాలు సాగిస్తున్నారు. వారు రోజుకు రెండు కేసులు అమ్ముకుంటే రూ.5 వేల వరకు ఆదాయం వస్తున్నట్టు సమాచారం.



పోలీసులకు చిక్కిన కర్ణాటక మద్యం వ్యాపారి (ఫైల్)

ఎక్కడ చూసినా కర్ణాటక టెట్రా ప్యాకెట్లే

పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్‌లోని పలు గ్రామాలకు కర్ణాటకకు అనేక అడ్డదారులు వున్నాయి. కొంతమంది అక్కడి మద్యం షాపుల నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో నగదు జమ చేస్తే కూలీలు సరుకును సులభంగా ఇక్కడికి చేరవేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన సరుకును ఇళ్లలో కాకుండా పొలాలు, గడ్డివాములు, భూమిలో పాతిపెట్టి రహస్యంగా విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు చిన్నచిన్న అంగళ్లలో జ్యూస్ ప్యాకెట్లలా అమ్ముతున్నారు. ఈ విషయమై స్థానిక ఎక్సైజ్ అధికారులు వివరణ ఇస్తూ ఇక్కడ కర్ణాటక మద్యం విక్రయాలు జరగడం లేదని చెప్పడం కొసమెరుపు.

మాపొలం పక్కన ఎటూ చూసినా టెట్రా ప్యాకెట్లే



పలమనేరు సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద నాకు పొలం ఉంది. వద్దూరుకు వెళ్లే దారిలో ఎక్కడ చూసినా కర్ణాటక టెట్రా ప్యాకెట్లే దర్శనమిస్తున్నాయి. ఇక్కడి మద్యం బాగుంటే ఆ మద్యం ఎందుకు తాగుతారు. అక్కడి నుంచి ఇక్కడికి మద్యం ఎలా చేరుతోందో ఎక్సైజ్ అధికారులు చెప్పాలి. మందుబాబుల వల్ల ఇక్కడ చోరీలు, గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి.

–పుష్పరాజ్, రిటైర్డ్ టీచర్, పలమనేరు

క్లుప్తంగా

కెంపేగౌడకు ఘన నివాళి

పలమనేరు: నియోజకవర్గ సమీపంలోని బేత మంగళ, కోలారులో ఆదివారం కర్ణాటక నాడ ప్రభు కెంపేగౌడ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పలమనేరు నియోజకవర్గంలో వున్న వక్కలిగెర కులానికి చెందిన ఆయన వంశస్తులు, కులస్తులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెంగళూరు మహానగర స్థాపనలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

అన్నదాన పథకానికి రూ.25 వేల విరాళం



చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి బెంగళూరు కోగిలి ప్రకృతినగర్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు, అరుణ దంపతులు రూ.25 వేల విరాళం ఇచ్చినట్లు ఈవో ఏకాంబరం తెలిపారు. అలాగే గోశాల నిర్వహణకు బెంగళూరుకు చెందిన ఆర్.ఆర్యన్‌రాజు రూ.5 వేలు ఇచ్చారని పేర్కొన్నారు. వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

రేపు మండల సమావేశం

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకహాజరు కావాలని సూచించారు.

ప్రొబేషనరీ ఎస్‌ఐగా రమేష్



సీఐ సుబ్బరాయుడిని కలిసిన ఎస్‌ఐ రమేష్

పుంగనూరు: పట్టణ పోలీసు స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్‌ఐగా ఎన్.రమేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఐ సుబ్బరాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో తీసువాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

పలమనేరు: పట్టణ సమీపంలోని పత్తికొండ వద్ద రెండు రోజుల క్రితం వ్యక్తి మృతిచెందాడు. అతని కోసం ఎవరూ రాలేదు. పోలీసులు విచారణ చేపట్టినా అతని ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో అతని మృతదేహానికి ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు స్థానిక హిందూ శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జీలుబాయ్, నాగశివ, శక్తి, ప్రసాద్, యువరాజ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు

వి.కోట: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ధూమపానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బస్టాండు, టీ షాపులు, దుకాణాలముందు ఇతరులకు ఇబ్బంది కల్గించేలా సిగరెట్, బీడీ, చుట్టలు కాల్చరాదని సూచించారు. అలాంటి వారికి రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న తల్లిదండ్రులు

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెలో ప్రాథమిక పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వుంది. దీనికి రక్షణగా కంచె లేకపోవడంతో పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మునీశ్వరునికి ప్రత్యేక పూజలు



మునీశ్వరుని ప్రతిమ

పలమనేరు: పట్టణ సమీపంలోని ఘోరీతోపులో ఆదివారం గాండ్ల కులస్తులు మునీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎవరూ తొక్కకుండా వున్న మట్టిని తీసుకువచ్చి మునీశ్వరుని ప్రతిమను తయారుచేశారు. దాన్ని విశేషంగా అలంకరించి పూజలు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచార కార్యక్రమంలో ప్రభోదసేవా సమితి సభ్యులు

వి.కోట: ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు పిలుపునిచ్చారు. వారు ఆదివారం బైరుపల్లి, ఎన్టీఆర్ కాలనీ, పాముగానిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, ప్రకాష్, శరవణ, పార్థసారథి, ఇందిర, వాణి, సుఖన్య, జలజాక్షి, వాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరిద్దామని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో మోసపోయిన అన్ని వర్గాలను కలిసి చైతన్యం చేయాల్సిన అవసరం వుందన్నారు. ప్రజాసామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, దానిపై మనం నిరుత్సాహ పడకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. కూటమి పాలనలో జరిగే మోసాలపై పోస్టులు పెడితే వెంటనే పోలీసుల ద్వారా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హరిబాబు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

జయమ్మ స్ఫూర్తి పురస్కారానికి డాక్టర్ శ్రీనివాస్ ఎంపిక



పలమనేరు: కవి, రచయిత, సాహిత్య విశ్లేషకులు డాక్టర్ శ్రీనివాస్‌ను కేఎస్ జయమ్మ స్ఫూర్తి పురస్కారానికి ఎంపిక చేసినట్టు పలమనేరుకు చెందిన ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ తెలిపారు. తనతల్లి జయమ్మ జ్ఞాపకార్థం పురస్కారాలు ఇస్తున్నామని, త్వరలో ఇక్కడ నిర్వహించే కార్యక్రమంలో పౌర సన్మానంతో పాటు పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు.

విజ్ఞాన శాస్త్రాన్ని అర్థమయ్యేలా బోధించాలి



టీచింగ్ లైట్ ద రైట్ వే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పలమనేరు: విజ్ఞాన శాస్త్రాన్ని పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం టీచింగ్ లైట్ ద రైట్ వే అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇందులో విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా బోధించాలో పుస్తక రచయిత మణి విశదీకరించారని తెలిపారు. అనంతరం పుస్తక రచయితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధనుంజయ, ఉమామహేశ్వర్‌రెడ్డి, తులసీనాథం నాయుడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం



సహదేవయ్య, నాగరాజు

సదుం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా సహదేవయ్య, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

గ్రామస్థాయి నుంచి కమిటీల ఏర్పాటుకు చర్యలు





పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో దామోదరరాజు, ఆర్.చెంగారెడ్డి తదితరులు

చౌడేపల్లె: గ్రామస్థాయి నుంచి కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్సార్ సీపీ నేతలను ఆదేశించారు. ఆయనను ఆదివారం తిరుపతిలోని స్వగృహంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు కలిశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీలో కమిటీలే కీలకం కానున్నాయని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, అక్రమ కేసులు, చంద్రబాబు చేస్తున్న మోసాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీరాములు, ఉప సర్పంచ్ ఆల్తాఫ్, నాయకులు బాబురెడ్డి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన చెంగారెడ్డి

పలమనేరు: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం తిరుపతిలో పలమనేరుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.చెంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నేపథ్యంలో తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. నక్కపల్లి భాస్కర్‌రెడ్డి, రాహుల్ రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, కొండారెడ్డి, డాక్టర్ బాలాజీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



బురదమయమైన సూర్యనగర్ రోడ్డు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోవున్న సూర్యనగర్ ఒకటో వీధి చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతోంది. నడిచేందుకు కూడా వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ మట్టి రోడ్డుకు పక్కనే మురుగు కాలువలు నిర్మించారు. వాటిలోకి వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయలేదు. ఈ క్రమంలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డులో నీరు నిలిచి బురదయమం అవుతోంది. సీసీ రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయడంతోపాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నారు.

గుక్కెడు మంచి నీరు ఇవ్వండి సారూ..!



గంగిరెడ్డిగారిపల్లెలో తాగునీటి కోసం బోర్ల వద్దకు వెళుతున్న మహిళలు



గంగిరెడ్డిగారిపల్లెలో కాలిపోయిన తాగునీటి బోరు మోటారు

రొంపిచెర్ల: గుక్కెడు తాగునీరు ఇచ్చి ప్రాణాలు కాపాడాలని మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీ బోరెడ్డిగారిపల్లె, కొత్తపల్లె, గంగిరెడ్డిగారిపల్లె గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మూడు గ్రామాలకు కలిపి బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 15 రోజుల క్రితం విద్యుత్ మోటార్ కాలిపోయింది. అప్పటి నుంచి తాగునీటి కోసం మహిళలు బిందెలు తీసుకుని వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడికి వెళితే కరెంట్ లేక వెనక్కి రావాల్సి వస్తోందని, కరెంటు వచ్చినప్పుడు మళ్లీ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మోటారు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యక్తిగత కక్షలు వద్దు



విలేకరులతో మాట్లాడుతున్న కురబ కులస్తులు

కుప్పం: వెనుకబడిన కురబ కులానికి చెందిన లాయర్ చంద్రప్పపై కొంతమంది వ్యక్తిగత కక్షలకు దిగుతున్నారని, ఇది ఏమాత్రం మంచిది కాదని కుప్పం నియోజకవర్గ కురబ కుల నాయకులు తెలిపారు. వారు ఆదివారం లాయర్ చంద్రప్ప గృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రప్ప కుప్పం కోర్టులో 20 ఏళ్లుగా లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. మచ్చలేని మంచి మనిషిగా పేరు పొందారని పేర్కొన్నారు. ఇటీవల కోర్టులో కొ వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో లాయర్‌గా చలామణి కావడం తోపాటు చంద్రప్పపై వ్యక్తిగత కక్షలకు దిగడం దారుణమన్నారు. ఆయన ఇంటి ముందు అనుమానితులు తచ్చాడడాన్ని తాము గమనించామన్నారు. చంద్రప్పపై వ్యక్తిగత కక్షలకు దిగితే కుప్పం నియోజకవర్గంలోని కురబ కులస్తులంతా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే కోర్టుల్లో పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత కక్షలకు దిగడం మంచి కాదని హితవు పలికారు.

అబ్దుల్ కలాం సేవలు వెలకట్టలేనివి



పలమనేరు: అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పుంగనూరు: అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న అయూబ్ ఖాన్, సీఐ సుబ్బరాయుడు

పలమనేరు: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు వెలకట్టలేనివని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం అబ్దుల్‌కలాం వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచదేశాల నడుమ నిలిపిన మహనీయుడు కలాం అని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, పెద్దపంజాణి కన్వీనర్ బాగారెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ జాఫర్, నాయకులు ప్రహ్లాద, శంకరప్ప, రెడ్డెప్పరెడ్డి, శంకర్‌రెడ్డి, ముజ్జు, ప్రజాష్, అనీల్, మీసేవా బాబు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి

పుంగనూరు: ఏపీజే అబ్దుల్‌కలాం ట్రస్టు ప్రతినిధి అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం పుంగనూరులో అబ్దుల్ కలాం వర్ధంతిని జరుపుకున్నారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ముఖ్యఅతిథిగా సీఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృపాకర్, ప్రొబేషనరీ ఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లికి పాలిస్తున్న శునకం



రొంపిచెర్ల: పిల్లికి శునకానికి మధ్య జాతి వైరం వుంది. పిల్లిని చూసిన వెంటనే శునకం దాన్ని చంపడానికి ప్రయత్నిస్తుంది. రొంపిచెర్ల మండలం మోటుమల్లెల పంచాయతీ నగిరి దళితవాడలో ఒక శునకం జాతి వైరాన్ని మరిచి పిల్లికి పాలు ఇచ్చి మాతృత్వాన్ని చాటుకుంటోంది. కుక్క కనిపించకపోతే పిల్లి అరుస్తూ వీధిలో తిరుగుతుందని, అదే విధంగా పిల్లి కనిపించకపోయినా కుక్క దీనంగా అరుస్తూ వెతుకుతుందని గ్రామస్తులు తెలిపారు. రాత్రిళ్లు రెండూ ఒకే చోట పడుకుంటాయని తెలిపారు.

లోపించిన పారిశుద్ధ్యం



చౌడేపల్లె సచివాలయం ముందు పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద పారిశుద్ధ్యం లోపించింది. పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. అధికారులు నిరంతరం కార్యాలయాలకు వెళ్తున్నా వాటిని తొలగించలేదు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, అందులోనైనా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా మురుగు కాలువలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో కాలువలు పూడిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని స్థానికులు వాపోతున్నారు. కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటికుంటలో పడి బాలుడి మృతి

పుంగనూరు: మండలంలోని రాజులూరులో ఆదివారం బాలుడు ఆడుకుంటూ నీటి కుంటలో పడి మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని రాజులూరుకి చెందిన గోపాల్ రాజు కుమారుడు ధీరజ్ కుమార్(10) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చూసే సమయానికి బాలుడు మృతి చెందాడు.

వ్యక్తిపై దాడి

పుంగనూరు: పట్టణంలో ఆటో డ్రైవర్ నరసింహులు, చెప్పులుకుట్టే వెంకటేష్(40) స్నేహితులు. వీరు ఆదివారం మద్యం షాపు వద్దకు వెళ్లారు. అక్కడ ఏదో విషయంగా ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో నరసింహులు ఆగ్రహంతో వెంకటేష్ గొంతుమీద చాకుతో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.